
51వ వార్డు మాధవధార సచివాలయం


మర్రిపాలెంలోని ఓ సచివాలయలంలో తల్లికి వందనం పథకం కోసం అడుగుతున్న లబ్ధిదారులు


మాధవధార వుడా కాలనీ సచివాలయంలో తల్లికి వందనం జాబితాలో పేర్లు చూసుకుంటున్న స్థానికులు

ముప్పతిప్పలు

- అందరికీ అందని 'తల్లికి వందనం'
- సచివాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- విద్యుత్ వినియోగం, అధిక మీటర్ల సాకు చూపుతూ తిప్పిస్తున్న వైనం
- కూటమి ప్రభుత్వ తీరుపై విద్యార్థుల తల్లుల ఆవేదన

మర్రిపాలెం: కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న తల్లికి వందనం పథకంపై చాలా మంది ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. అధికారంలోకి రాకముందు ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఆర్థిక సాయం అందిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం.. తీరా అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెడుతోంది. విద్యుత్ మీటర్లు, వాడిన యూనిట్ల సాకు చూపి గతంలో లబ్ధి పొందిన వారికి సైతం మొండిచేయి చూపించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తల్లికి వందనం లబ్ధి పొందేందుకు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ ప్రదక్షిణలు చేస్తున్నా రు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకానికి అర్హులుగా ఉన్న తాము.. కూటమి ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నామని వాపోతున్నారు. బంధువుల పేర్లతో ఉన్న ఆస్తులు, విద్యుత్ మీటర్లు, భూములతో తమకేం సంబంధం లేదని, మ్యాపింగ్ పేరిట లబ్ధిదారులకు చేరాల్సిన పథకాలకు గండిపెడుతున్నారని మండిపడుతున్నారు. ఇచ్చిన హామీ లు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఇలాంటి సాకులు చూపించి అన్యాయం చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోడు వినే నాథులేరి..?

జీవీఎంసీ 51వ వార్డులో 6 సచివాలయాలున్నాయి. అందులో ఒక సచివాలయానికి సగటున కనీసం 300 మంది వరకు అర్హులుంటారు. 53వ వార్డులో పూర్తిగా నాలుగు సచివాలయాలున్నాయి. మరో సచివాలయం కొంత మేర వేరే వార్డులోకి వెళ్తుంది. తల్లికి వందనం రాలేదని, తమ పేర్లు అర్హుల జాబితాలో చేర్చాలని కోరుతూ కొంతమంది లబ్ధిదారులు నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే పలు సచివాలయాల్లో గ్రీవెన్స్ తీసుకునే నాథులే కరువయ్యారు. కొన్ని చోట్ల సచివాలయాల్లో సిబ్బంది లబ్ధిదారులకు తల్లికి వందనం పథకంపై సమాధానం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

ఏవేవో సాకులు చూపించి..

మాధవధార, మర్రిపాలెం ప్రాంతాల్లో అన్ని అర్హత లున్న పలువురు లబ్ధిదారులకు ఒకరికి లేనిపోనివి 9 మీటర్లు, మరొకరికి ఎక్కువ మీటర్లు చూపించి ఇప్పుడు పథకాలు ఇవ్వకుండా ఆపేశారని లబ్ధిదారులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకు పథకాలు అందాయని, ఇప్పుడు ఎందుకు అందడం లేదని అంటున్నారు. మరి కొందరి పిల్లలకు కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్నారని తల్లికి వందనం రాలేదని, ఒక చిన్నపాటి సూపర్‌వైజర్ ఉద్యోగం చేసుకుంటున్న ఓ తండ్రికి ట్యాక్స్ కడుతున్నట్టు చూపించడం విడ్డూరంగా ఉందంటున్నారు. ఒకరికైతే ఏకంగా 74 ఎకరాల భూమి అక్కడెక్కడో కాకినాడలో ఉన్నట్టు చూపించడం.. ఇలా చాలా మంది లబ్ధిదారులకు సంబంధం లేని కారణాలతో తల్లికి వందనం లబ్ధి అందకుండా పోయింది. అధికారులు స్పందించి అర్హులందరికీ తల్లికి వందనం పథకం అందేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జాబితాలో పేర్లు మాయం

జీవీఎంసీ 51, 53 వార్డుల పరిధిలో కొంతమంది లబ్ధిదారుల పేరుపై ఒక్క మీటరు ఉంటే వారికి 120 నుంచి 160 యూనిట్ల వరకు బిల్లు వచ్చేదని, ఇప్పుడు 300 యూనిట్లు ఎలా నమోదైందని వాపోతున్నారు. కొంతమందికి వారి వారి బంధువుల మ్యాపింగ్‌లో నమోదు కావడం వల్ల మొత్తం యూనిట్లు ఒక లబ్ధిదారు పేరుపై పెరిగిన యూనిట్లు చూపిస్తున్నట్టు పలుచోట్ల సచివాలయ సిబ్బంది సెలవిస్తున్నారు. మరి కొందరి విషయానికి వస్తే ఒక విద్యుత్ మీటర్ ఉండి వారి బిల్లు 140 నుంచి 150 యూనిట్ల వరకు చెల్లిస్తున్నారు. వారి పేరు పథకం జాబితాలో లేకపోవడం ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇదేంటని సచివాలయ కార్యదర్శులను ప్రశ్నిస్తే.. వారి పేరుపై మరో చోట విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టు ఆధార్‌లో లింక్ అయినందున తల్లికి వందనం లబ్ధిదారుల జాబితాలో పేరు నమోదు కాలేదని చెబుతున్నారు. దీంతో కంగుతింటున్న లబ్ధిదారులు విద్యుత్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

రైతుబజార్‌లో తనిఖీలు


సీతమ్మధార రైతుబజార్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస కిరణ్

తాటిచెట్లపాలెం: సీతమ్మధార రైతుబజార్‌లో శుక్రవారం మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస కిరణ్ పర్యటించి, తనిఖీలు చేశారు. బజార్‌లోని ప్రతి స్టాల్‌ను సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించాలని, ఉల్లిపాయలు, టమోటా స్టాళ్లలో విక్రయాల్లో నాణ్యతను కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు. డీడీ వెంట రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ ఉన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కళా ఆస్పత్రి సహకారంతో ఆదివారం మురళీనగర్ వాకర్స్ పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు జరగనున్న ఈ శిబిరంలో బీపీ, సుగర్, ఆర్థోపెడిక్, సాధారణ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మురళీనగర్ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులకు టీ షర్ట్‌లు అందిస్తున్న వరప్రసాద్

మురళీనగర్: చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ సూచించారు. స్టార్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం సాధ్యమవుతుందన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ గెలుపునకు ప్రయత్నించాలన్నారు. కోచ్ సాదా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాతల సహాయంతో బాక్సింగ్ క్రీడాకారులకు వరప్రసాద్ టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. రిటైర్డ్ సీహెచ్‌వో వెంకటేశ్వరరావు, పప్పల గౌరి పాల్గొన్నారు.

జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి


డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయలక్ష్మి

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై ఆమె వచ్చారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తిని మర్యాదపూర్వకంగా విజయలక్ష్మి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పరిశీలన గృహం సందర్శన


గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: విశాఖలో అబ్జర్వేషన్ హోమ్, స్పెషల్ హోమ్, బాలికల గృహాలను శుక్రవా రం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి హోమ్‌ల్లో పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించారు. అక్కడి పిల్లలతో మాట్లాడి వారి బాగోగులు, విద్య, ఆరోగ్య, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. హోమ్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, వైద్య సేవల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: పిల్లల్లో పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను తొందరగా గుర్తించి, సరైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లా స్థాయి వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే సమస్యలను గుర్తించి, వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతీ చిన్నారికి సమగ్ర ఆరోగ్య పరీక్షలను తగిన మార్గదర్శకాలు పాటిస్తూ అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.హారిక, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ వి.సంధ్యారాణి, ఇ.శాంతిప్రియ పాల్గొన్నారు.

నీటి సరఫరా సిబ్బంది సమ్మె బాట


సీతమ్మధార పంప్‌హౌస్ వద్ద సమ్మె చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు


బర్మా క్యాంప్ మంచినీటి విభాగం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులు గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగారు. దీనిలో భాగంగా శుక్రవారం సీతమ్మధారలోని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం సహాయక ఇంజినీర్ కార్యలయం పంప్ హౌస్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ట్రెజరర్, సీతమ్మధార సెక్షన్ ప్రెసిడెంట్ గురు సాగరమూర్తి మాట్లాడుతూ 30 ఏళ్లగా జీవీఎంసీ ఇంజినీరింగ్ సెక్షన్ వాటర్ సప్లై విభాగంలో పనిచేస్తున్నామని, చాలీచాలనీ జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం ప్రకారం పెరిగినా జీతాలు చెల్లించలేదని, ఈ కారణంగా కార్మిక సంఘ నేతలు పిలుపుమేరకు సమ్మె బాట పట్టామని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అంతవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమార్, శ్రీరామమూర్తి, గణేష్, గురునాథరావు, ప్రసాద్, హరీష్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

పెంచిన జీతాలు చెల్లించాలి

మురళీనగర్: బర్మా క్యాంప్ బ్లాక్–15లో పనిచేస్తున్న మంచినీటి సరఫరా విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అరకొర జీతాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని, జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం మేరకు పెంచిన జీతాలను చెల్లించాలని విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

ఏడుగురు మానసిక రోగులకు షెల్టర్‌లో ఆశ్రయం


వసతి గృహంలో ఆశ్రయం పొందిన వారితో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం: మానసిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న ఏడుగురికి ఏయూటీడీ జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. గతంలో వీరందరినీ రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి కాపాడినట్లు చెప్పారు. వివరాలివి.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మమ్ము, గుజరాత్‌కు చెందిన గీత, జగదల్పూర్‌కు చెందిన శ్రీకుమారికి మానసిక స్థితి బాగోలేక చినవాల్తేరు మానసిక వైద్యశాలలో చేర్పించి వైద్యం అందించారు. వారు కోలుకున్నప్పటికీ, ఈ ముగ్గురినీ తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో ఏయూటీడీ సిబ్బంది డిశ్చార్జి తీసుకుని షెల్టర్‌కు తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన హేమలతను రైల్వేస్టేషన్‌లో రక్షించారు. ఒడిశా పూల్వనికి చెందిన సమీర్‌కుమార్, రాయపూర్ టాటానగర్‌కు చెందిన అర్జున్ నిశద్, మహారాష్ట్ర పూణేకు చెందిన బికాస్‌లను ఏయూటీడీ ద్వారా రైల్వే స్టేషన్‌లో కాపాడారు. ఈ ఏడుగురు పూర్తిగా కోలుకున్నారు. దీంతో వీరిని సొంతూళ్లలో కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని కోరుతూ ముంబై నుంచి వచ్చిన శ్రద్ధా సోషల్ వర్కర్లకు శుక్రవారం వివరాలు అందించారు.

నేడు కళాభారతిలో నాట్య పురస్కారాల ప్రదానం

మద్దిలపాలెం: సాయిసురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నృత్యకారులకు నాట్య పురస్కారాలు ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు రేఖ అట్టాడి, సాయి, సురేఖ అట్టాడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంప్రదాయ నాట్యం మొదలు పెట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన నృత్యకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నాట్య ప్రదర్శనలు ప్రారంభమవుతాయని, అందరూ ఆహ్వానితులేనని చెప్పారు.

కనకమహాలక్ష్మి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రలో ఆర్టీసీ సేవలకు ప్రశంసలు


ఆర్టీసీ సిబ్బందికి యోగా టీ షర్ట్‌లు అందిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం: విశాఖ బీచ్ రోడ్డు వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజా రవాణ శాఖ నుంచి అందించిన ఉత్తమ సేవలను ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారని ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మద్దిలపాలెం ఆర్టీసీ బస్ డిపో వద్ద గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. యోగాంధ్ర విధుల్లో పాల్గొన్న అందరినీ ఆయన అభినందించారు. వారికి యోగా టీ షర్ట్‌లు అందజేశారు. ప్రతి ఒక్కరూ విధిగా యోగా చేయాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడి ఉపసమనంతోపాటు ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో భాగస్వాములు కావడం గొప్ప విషమయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేసి ప్రయాణికులకు దగ్గరవ్వాలని, సిబ్బంది ప్రవర్తన మరింత మెరుగుపరచుకొని సమయపాలన పాటించాలని సూచించారు. జూలైలో జరగబోయే సింహాచలం గిరి ప్రదక్షిణకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో మేనేజర్ కె..గంగాధర్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీ రామకృష్ణ, స్టోర్స్ ఇంజినీర్ అప్పారావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెం డిపో మేనేజర్‌కు బదిలీ

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి విజయనగరం డిపోకు బదిలీ అయ్యారు. ఆరేళ్లుగా ఇక్కడ ఆమె విధులు నిర్వహించారు. డిపోలో తన మార్క్ సేవలను అందించారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి ప్రయాణికులతో చక్కని అనుబంధం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇటు సిబ్బందిలో.. అటు ప్రయాణికుల్లో అరుణకుమారి మంచి పేరు సంపాదించుకున్నారు. డిపో ప్రగతికి ఆమె చేసిన కృషిని సిబ్బంది కొనియాడారు. డిపో నుంచి బస్సుల సమయపాలన విషయంలో కచ్చితంగా వ్యవహరించేవారు. ఆమె స్థానంలో పూర్తి స్థాయి డీఎంగా ఎవరినీ నియమించలేదు. తాత్కాలికంగా వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

డ్రైడేతో దోమల నిర్మూలన


దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్


దోమ లార్వా పెరుగుతున్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

సీతంపేట: వారంలో ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ జి.లక్ష్మణ్ అన్నారు. 43వ వార్డు నరేంద్రనగర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. మలేరియా సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ వారం రోజులకు పైగా మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. వర్షా కాలం ప్రారంభమైనందున ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది పద్మావతి పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి


నరసింహనగర్‌లో ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

తాటిచెట్లపాలెం: జూలై 9న నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. 45వ వార్డు నరసింహనగర్‌లో శుక్రవారం మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ పెర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కార్మికులకు, ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చుతోందన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 5 వేల మంది కార్మికులను కేంద్ర ప్రభుత్వం తొలగించిందని, ప్లాంట్ కార్మికులను చంద్రబాబు ప్రభుత్వం పోలీసులతో అణచివేస్తోందన్నారు. ఈ చర్యలన్నింటినీ నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన జాతీయ సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జోన్ సెక్రటరీ ఒ.అప్పారావు, ప్రెసిడెంట్ ఎస్.శ్రావణ్‌కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు యు.ఎస్.ఎన్.రాజు, నాయకులు ఎన్.ప్రకాశరావు, వి.సీతాలక్ష్మి, రమణమ్మ, వెంకటలక్ష్మి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అంధ బాలలకు సరకుల వితరణ


హోమ్‌కు సరకులు అందజేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: లక్ష్మీపురంలోని హెల్ప్ అండ్ హెల్ప్ అంధుల విద్యాసంస్థకు జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరకులు అందజేశారు. కార్పొరేటర్ పూర్ణిమ మాట్లాడుతూ సేవలో మానసిక ప్రశాంతత, సంతృప్తి ఉన్నాయన్నారు. మానవసేవే మాధవ సేవగా చేస్తున్న భావించి, సేవలు అందిస్తున్న హోమ్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం హోమ్‌లో అంధులకు, అభాగ్యులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేళంగిణిరావు, సుధాకర్ హోమ్ సభ్యులు పాల్గొన్నారు.

వస్త్ర సంచులనే వినియోగించాలి


డ్రై డే కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జగన్నాథ రథ యాత్రకు వచ్చే భక్తులు పూజా సామాగ్రిని వస్త్ర సంచుల్లోనే తీసుకువెళ్లాలని జెడ్సీ మల్లయ్య నాయుడు సూచించారు. వన్‌టౌన్‌లో జగన్నాథ రథ యాత్ర ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఆయన పరిశీలించి, మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధంలో జీవీఎంసీకి సహకరించాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వదిలి, ఇళ్ల నుంచి జ్యూట్ బ్యాగ్‌లు, వస్త్ర సంచులతో ఆలయాలకు రావాలన్నారు. వ్యాపారులు కూడా వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లలో సరకులు ఇవ్వకూడదని తెలిపారు.

డ్రై డేపై అవగాహన: వన్‌టౌన్ నుంచి జగదాంబ వరకు రహదారులు, కల్వర్టులను పరిశీలించి, చెత్తకుప్పలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం డ్రై డే కార్యక్రమంలో పాల్గొని దోమల ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.